40911880l

వివిధశాస్త్రచయము వేదవేదాంగముల్
జీవి మనసు తెరను చీల్చలేవు
తెరకు యివల జీవి దేవుడవ్వలనుండు
కార్యమివల నవల కారణంబు.

దివ్యాత్మస్వరూపులారా!

భారతీయుల యొక్క పండుగలు, పర్వదినములు భారతీయ సంస్కృతిని, సభ్యతను, సమైక్యతను తెలిపే మహత్తరమైన పర్వదినములు. ప్రాచీన కాలమునుండి మహత్తరమైన శక్తివంతమైన భారతీయసంస్కృతిని అర్థము చేసుకొనలేక అంతరార్థమును అంతకంటె తెలుసుకొనలేక మానవత్వమును వ్యర్థముగావించుకుంటూ వస్తున్నది భారతదేశము.

పండుగలకు, పర్వదినములకు బాహ్య అంతరార్థములు లేకపోలేదు. కాని అట్టి బాహ్య అంతరార్థములు గుర్తించటానికి మానవుడు అంత తీవ్రముగా ప్రయత్నించటము లేదు. లోక కళ్యాణార్థమై అవతరించిన అవతారములయొక్క జన్మదినములను మహనీయుల యొక్క జన్మదినములను, లోక కంటకులైన దుర్గుణ దురాచారములచే ప్రవర్తించిన దుర్మార్గుల యొక్క మరణాన్ని గుర్తింపజేసే నిమిత్తమై పర్వదినములు యేర్పడినవి. పండుగలనగా మహనీయుల జన్మదినములు, దుష్టుల మరణముల దినములు గుర్తుతెచ్చుకొనే నిమిత్తమై పండుగలు అనుభవిస్తూ వచ్చారు. ధర్మస్వరూపుడైన రామచంద్రుడు అవతరించిన దినము చైత్ర శుద్ధ నవమి. ఆనాడు రామ జన్మదినోత్సవమని పండుగగా మనము చేసుకుంటున్నాము. శ్రావణ బహుళ అష్టమి ధర్మస్థాపనకై అవతరించి కేవలము ధర్మప్రబోధకై ఆచరించి గీతాచార్యుడని పేరుపొంది కృష్ణుని జన్మదినముగా మనము విశ్వసించి ఆ అష్టమి దినము పండుగ చేసుకొంటున్నాము

ఈ నవరాత్రులు, శివరాత్రులు, సంకురాత్రులు అనే యీరాత్రులంతా కూడను దుష్టులను సంహరించి దుష్ట మరణ సంబంధమైన పర్వదినములుగా భావించి ఆనాడు పండుగలు మనము చేసుకుంటున్నాము. దుష్టుడు, దుర్మార్గుడు అయిన రావణుని వేదమూర్తి విద్యావంతుడైనప్పటికిని, యెంత ధైర్యసాహస వంతుడైనప్పటికి అతనిని ధర్మహీనుడుగా భావించటము చేతనే అతనిని సంహరించిన దినమే యీ విజయదశమి. అనేక దుష్టశక్తులతో తాండవమాడుతున్న మహిషాసురుని దుర్గ, సరస్వతి, పార్వతి అనే యిచ్ఛాశక్తి, క్రియాశక్తి, జ్ఞాన శక్తి యీ మూడింటి యేకత్వము చేత, ఆశ్వీజ శుద్ధ పాడ్యమినుండి నవమి వరకు కూడను యీ ముమ్మూర్తులు ఏకత్వాన్ని ధరించి యుద్ధము ఆచరించిన దినములు. కడపటి

409118802

దినము నవమి దినము మహిషాసుర మర్దన గావించిన దినము. దానవుల రాజైన రావణుని వధ మార్చి ఆదే దినము అయోధ్యలో పట్టము కట్టుకొన్న దినమే యీ విజయదశమి. విక్రమాదిత్యుడు మహా వరప్రసాదమైన సింహాసనమును అలంకరించిన దినము యీ విజయదశమి. జైన మత స్థాపకుడైన మహావీరుడు మరణించిన దినమే యీ విజయదశమి. అదే విధముగానే దుష్టులు మరణించిన దినము, సజ్జనులు జన్మించిన దినము భారతీయులు పండుగలుగా భావించి ఆనందాన్ని అనుభవిస్తూ వచ్చారు. కృష్ణుడు అధర్మమూర్తి అన్యాయ, అక్రమ, అనాచారములతో ప్రవర్తించుచున్న కంసుని సంహరించిన తరువాత ఆ రాజ్యమును ఇతరులకు పట్టము గట్టినప్పుడు దానికి పూర్వమై నరకాసురుడు అనేక పర్యాయములు యీ మధురపై దండెత్తి వచ్చాడు. అనేక పర్యాయములు మధురపై దండెత్తి రావటం చేత ప్రజలలో ఒకవిధమైన భయభ్రాంతులు అభివృద్ధి చెందటం చేత మధురవాసులందరికి కూడను శాంతి భద్రతలు చేకూర్చు నిమిత్తమై ద్వారకలో ఒక గ్రామము నిర్మించి అందులో యీ ప్రజలనందరిని ప్రవేశపెట్టాడు.

ఈ నరకాసురుడనే రాక్షసుడు పాలన చేయుచున్న గ్రామమే ప్రాగ్జ్యోతిషాపురమని పేరు. ఇక్కడ నాలుగు పదములున్నాయి. ప్రాగ్, జ్యోతి, షా, పురం. ఈ నాలుగు పదములకు సరైన అర్థమును మనము గుర్తించినప్పుడు యీ ప్రాగ్జ్యోతిషాపురము మానవుని యొక్క హృదయమనే చక్కగా స్పష్టము గావించుచున్నది. ప్రాగ్ అనగా పూర్వము అనగా ముందు అని అర్థము. జ్యోతి అనగా దీపము. షా అనగా మరచటము, పురమనగా దేహము. పూర్వము జ్యోతిర్మయమైన, ఆత్మజ్యోతి పరంజ్యోతి, సచ్చిదానంద జ్యోతిని మరచటం చేతనే మానవుడు ప్రాగ్జ్యోతిషాపురమనే దానిలోపల జీవిస్తూ వున్నాడు. ఇక్కడ యీ హృదయమునందు, యీ ప్రాగ్జ్యోతిషాపురమందు యీ రాక్షస అనే నరత్వము కేవలము మానవత్వాన్ని విస్మరించింది. నరుడు అనగా ఆత్మ అనే అర్థము ఆకాశాది భూతములు ఆవిర్భవించిన ప్రదేశమే నరత్వము. ఈ నరత్వమునందు ఆకాశాది భూతములచే జలమయముగా భావించి నారము అనికూడను పిలుస్తూ వచ్చారు. నారములనగా జీవులని మరొక అర్థము. నారములకు నిలయమైనది కనుకనే నారాయణుడని పేరువచ్చింది. రహః అనగా యేమి? న అనగా లేదు. రహః అనగా శాశ్వతము అనికూడ అర్థము వస్తుంది. నర అనగా శాశ్వతము కాదు అని అర్థము. నిత్యము, సత్యము అయినది కాదు మానవత్వము. ఇట్టి నర అనే పురమునందు అసురత్వమనే దుర్గుణములు ప్రవేశించటము చేత అతనే నరకాసురుడైనాడు. దుర్గుణములే అసురత్వమునకు చిహ్నములు.

కనుక నర అసుర రెండు తత్త్వములు కూడుట చేత అతడు నరకాసురుడు అయిపోయినాడు. నరకాసురుడనగా నరకమునకు గొనిపోయే వాడని కూడ మరొక అర్థము. కాని చారిత్రక నరకాసురుని చరిత్ర మనము విచారించినప్పుడు అతను మహా దుష్టుడు దుర్మార్గుడు. ఆ రాజ్యములో బజారునందు గాని, గృహమునందుగాని యేనాడు కూడను జ్యోతులు వెలిగినటువంటివి గావు. ఆ రాజ్యములో ఎవ్వరికిని కనుపించేవారు కాదు. దీపము వెలుతురు యేనాడు చూచినవారు కాదు. అంతటి దుర్మార్గుడు యీ

నరకాసురుడు. అనేక మంది రాజకన్యలను, అనేక మంది స్త్రీలను యువతులను తీసుకువచ్చి బంధించి యనేక విధములుగా చెరసాలయందు హింసించేవాడు. ఈ బాధలను తట్టుకొనలేక అనేక మంది కృష్ణునికి మొరపెట్టుకున్నారు. మానవాళినే నిర్మూలముగావించటానికి పుట్టించిన రాక్షసుని సంహరించి జీవనోద్ధారము చెయ్యాలని, మానవకళ్యాణము చేకూర్చాలని యాచించారు. ఎవరిని హింసించినారో వారివలనే మరణము ఏర్పడాలి. కత్తితో సంహరించినవానికి కత్తితోనే మరణము వుంటున్నది. దుర్గుణములతో ప్రవర్తించే మానవునికి దుర్గుణములే అతనిని హింసిస్తాయి. అదేవిధముగా యీనాడు స్త్రీలను అనేక విధములుగా హింసించినటువంటి దుర్మార్గుడు కనుక స్త్రీలతోనే అతని మరణము గావించాలి. అందు నిమిత్తమై సత్యభామను వెంటగొని ఆ నరకాసురుని సంహరించాలి. సంహరించిన దినమే యీ నరక చతుర్దశి. దీనినే నరక చతుర్దశి అని పిలుస్తూ వచ్చారు. రెండవ దినము అమావాస్య. ఆ నరకాసురుని బంధనమందుండిన పదహారు వేల మంది కన్యలను బంధవిముక్తి గావించాడు కృష్ణుడు. వారిని వారి వారి స్వస్థానములకు పొమ్మని ఆజ్ఞాపించాడు కృష్ణుడు. కానీ యీ పదహారువేలమంది గోపికలు కూడను కృష్ణుని పాదములపై బడి ప్రార్థించారు. స్వామీ యింతకాలము యీ చెరసాలయందు యీ దుర్మార్గుని వశమునందు వుండుటచేత సమాజములో ప్రతి వ్యక్తి కూడను మమ్ములను శంకిస్తారు. మమ్ములను సమాజము గౌరవించదు. అలాంటి అగౌరవములో జీవించే జీవితముకంటె నీ పాదములకు అంకితము గావటం చాలా వుత్తమమన్నారు.

ఇన్నివిధముల మా ప్రాణములు రక్షించిన నీవు మమ్ములను పోషించలేవా? కనుక మమ్ములను రక్షించి మమ్ములను ఆదరించి, మమ్ములను పోషించవలసినదని కోరారు. ఇంతలోకాన్ని భరించే నీవు మమ్ములను భరించలేవా? అని ప్రార్థించేటప్పటికి యీ పదహారు వేల మంది గోపికలను నేను రక్షిస్తాను, భరిస్తానని వాగ్దానమిచ్చారు. ఈ పదహారు వేలమంది గోపికలను భరించినటువంటివాడు కనుకనే భర్త అని పేరు వచ్చింది. భర్త అనగా husband అని మొగుడని చెప్పటానికి వీలులేదు. భరించేవాడు కనుక భర్త అని. భరింపబడేది కనుక భార్య అని అర్థము. కనుక యీ పదముల అర్థమును మనము గుర్తించుకొనలేక పదహారు వేలమంది గోపికలను పెండ్లాడినాడు కృష్ణుడని కూడను ఒక అపవాదము క్రింద వాళ్లాడుతూ వచ్చారు. కేవలము అంకితమైన వారు యీ పదహారు వేల మంది గోపికలు. వారి జీవితమును ఉద్ధరించి ఆదరించి భరించినటువంటివాడు కనుకనే కృష్ణునికి భర్త అని పేరు వచ్చింది.

కనుక యీ అమావాస్య దినము గోపికలను భరించిన దినము. చతుర్దశి దినము నరకాసురుని వధించిన దినము. ఈ అమావాస్య దినము పూర్ణ చీకటిగా వుంటుంది. అంధకారముగా వుంటుంది. ఇంత అంధకారములోపల మా జీవన జ్యోతిని వెలిగించినవాడు కనుకనే యీనాడు జీవితమనేది అంతా కూడను పౌర్ణమిగా వుండాలని ప్రార్థించారు. కనుకనే యీనాడు కేవలము అమావాస్య అంధకారము అయినప్పటికిని ఎక్కడ చూచినా కూడను యీ పతాకులు వెలిగించి అనేక విధములుగా జ్యోతులు వెలిగించి యీనాడు ఒక పూర్ణిమ మాదిరి

409118804

యీ రాత్రినంతను అనుభవిస్తూ వచ్చారు. ఆనంద వృత్యోత్సవముల చేత యీవిధమైన వైభవములను అనుభవిస్తూ వచ్చారు.

దీనికి వైజ్ఞానికమైన మరొక అర్థము కూడా వుంటున్నది. గడచిపోయినది వర్షాకాలము. ఎక్కడ చూచినా నీరు, బురద యీవిధమైన మాలిన్యముచేత అనేక విధములైన క్రిమికీటకాదులు అభివృద్ధి అయిపోతున్నాయి. యిలాంటి క్రిమికీటకాదుల చేత మానవునికి అనారోగ్యము అభివృద్ధి అవుతుంటాయి. ఈ విధమైన మతాబులు కాల్చటం చేత యీ పొగ చేత యీ విషమయమైన మందుల చేత ఆ క్రిమికీటకాదులు నశిస్తాయి. తద్వారా మానవుని యొక్క ఆరోగ్యము ఆనందము అభివృద్ధిగావిస్తుంది.

అనేక విధములైన అంతరార్థములు పురస్కరించుకొనియే భారతీయుల పండుగలు ఏర్పడుతూ వచ్చినాయి. ఇక్కడ మరొకటి. ఏకోహం బహుస్యాం అనే వేదవాక్యమును పురస్కరించుకొని యిక్కడ మనము యీనాడు జ్యోతిని వెలిగిస్తుంటాము. అనేక విధములుగా మనము యీ అలంకారము చేస్తాము. కాని మొట్టమొదట ఒక్క జ్యోతిని మాత్రము వెలిగించి ఆ జ్యోతి ద్వారా అన్ని జ్యోతులను వెలిగిస్తూపోతాం. ఇన్ని వేల జ్యోతులను వెలిగించేది ఒక జ్యోతి. ఆ ఒక్క జ్యోతియే అనేక జ్యోతులను వెలిగించుతూ వచ్చింది. ఆ ఏక జ్యోతియే పరంజ్యోతి. మిగిలినవి జీవన జ్యోతులు. ఈ పరంజ్యోతి ఒక్కటి మాత్రమే జీవనజ్యోతులనంతా వెలిగిస్తూ వచ్చిందని ఏకోహం బహుస్యాం. ఆ ఒక్క జ్యోతియే అనేక జ్యోతులుగా రూపొందింది. అట్టి పారమార్థికమైన అర్థాన్ని కూడను నిరూపించిన దినము యీ దీపావళి దినము. ఐతే యీ దీపములంతా కూడను కేవలము బాహ్యమైన అంధకారమును మాత్రమే దూరము గావిస్తున్నది. ఈ జ్యోతికి మరొక సుగుణము కూడను వుంటున్నది. దీపము ఎక్కడ పెట్టినప్పటికి అది ఊర్ధ్వస్థితికే ప్రయాణము అవుతుందిగాని అధోస్థితికి కాదు. అనగా ఉన్నత స్థాయికే పోతుంది జ్ఞానమార్గము, పుణ్యమార్గమునకే అది ప్రయాణము సల్పుతుంది.

జ్యోతిని వెలిగించాలంటే నాలుగు పదార్థములు వుండాలి. ఒకటి ప్రమిద. రెండవది ఆయిల్. మూడవది వత్తి. నాల్గవది అగ్గిపెట్టె. ఈ నాలుగులో యే ఒక్కటి లేకపోయినా మనము జ్యోతిని వెలిగించలేము. ఈ నాలుగు కూడను తప్పనిసరిగా వుంటుండాలి. అయితే యింత ఏ చీకటిని పోగొడుతున్నది బాహ్యమైన చీకటిని పోగొడుతున్నది. ఒకానొక సమయములోపల హనుమంతుడు సీతాన్వేషణ నిమిత్తమై లంకనంతా అగ్గిపెట్టి పర్వతము పైన కూర్చొని లంకనంతా చూస్తున్నాడు. ఆనాడు చిమ్మచీకటిలో కమ్ముకున్న లంకాపట్టణమంతా పట్టపగలుగా వెలుగుతున్నది యీ అగ్నిచేత. రావణుడు మహాశక్తివంతుడు. అరువదినాలుగు విద్యలు నేర్చిన ప్రవీణుడు. మహాశక్తి సామర్థ్యములు కలిగిన మేఘనాధుడు అనే కుమారుడు కలిగినవాడు. బలవంతుడైన కుంభకర్ణుని తమ్మునిగా కలవాడు. మహా శ్రీమంతుడైన కుబేరునికి తమ్ముడైనవాడు. పదితలలు, యిరవై చేతులు కలిగినవాడు. కానీ యిన్ని కలిగిన యితని ఎవరైనా రక్షించగలిగారా? లంకాపట్టణమంతా పట్టపగలుగా వెలుగు

409118805

తూ వుండినప్పటికిని రావణుని మనస్సులోపల అంధకారమనే చిమ్మచీకటి కప్పుకుంటున్నది. అజ్ఞానము. అదే అహంకారము. అదే ఆడంబరము. రాగద్వేషములతో కూడిన రావణాసురుని హృదయము చిమ్మచీకటిగానే వుంటున్నది. ఈ చీకటిని పోగొట్టేవారు ఎవరు? ఇది కేవలము జ్ఞానజ్యోతి వలనే యీ చీకటి పోతుంది తప్ప అన్యజ్యోతులతో యీ చీకటి పోయేది కాదని స్మరించాడు.

ఐతే యీ జ్ఞానజ్యోతిని యేవిధముగా మనము వెలిగించాలి. ఈ అంతర్ అంధకారము నిర్మూలము గావించాలంటే ఆత్మజ్యోతి కావాలి. జ్ఞానజ్యోతి నివ్వాలి. దీనికి కూడను నాలుగు పదార్థములు వుండాలి. వైరాగ్యమే దీనికి ప్రమిద. భక్తియే దీనికి తైలము. చిత్తైకాగ్రతే దీనికి వత్తి. తత్త్వజ్ఞానమే అగ్గిపెట్టె. ఈ నాలుగు లేకుండా వుండిన ఆత్మజ్ఞానమనేది మనకు లభ్యము కాదు. అన్నింటికిని వైరాగ్యమనే ప్రమిద అత్యావసరము. అదే ఆధారమైనది. ఈ వైరాగ్యమే లేకుండిన యింక ఏ విధమైన విద్యలు చదివినప్పటికిని ఎన్ని శాస్త్రములు చదివినప్పటికిని, ఎంత వేదములు పఠించినప్పటికిని ప్రయోజనము లేదు. కనుకనే న కర్మణా, న ప్రజయా, ధనేన త్యాగేనైకే అమృతత్వమానసు అనింది వేదము.

వైరాగ్యమనగా ఏమిటి? రాగము లేకపోవటమే వైరాగ్యము. దేహమే నేను అదే అహంకారము. ఈ దేహమునకు సంబంధించిన సమస్త పదార్థములు నావి నావి అనే మమకారము. ఈ అహంకారము, మమకారము రెండు చేరే యీ రాగముగా మారిపోతున్నాయి. ఈ రాగము చేతనే అజ్ఞానమనే రోగముతో పడిపోతున్నారు మానవుడు. కనుక యీ రాగమనే రోగము యేవిధముగా నిర్మూలము చెయ్యాలి. విచారించాలి. ఈ జగత్తు ఏమిటి? నిద్ర ఏమిటి? సుషుప్తి ఏమిటి? ఈ మూడు కాలములను మనము చక్కగా విచారణ చేసినప్పుడు జాగ్రత్త అంతా జడము. దేహమంతా జడమయమైనదే. కానీ నడుస్తుండాది. చూస్తుండాది. మాట్లాడుతుండాది. వింటున్నాది. అనుభవిస్తుండాది. దీనిని జడమని చెప్పటానికి యేరీతిగా వీలవుతుంది. కాలోచితముగా చైతన్యము ప్రవేశించి జడమును కదలింపచేస్తూ వుంటుండాది. అంతేగాని దేహము చైతన్యము కాదు. గడియారము వుంటుండాది. గడియారమునకు కీ యిచ్చినప్పుడు ముల్లన్ని కదులుతున్నాయి. కదిలినంత మాత్రమున ప్రాణమున్నట్లు కాదు. ఆ కీ ఆధారము చేతనే యీ ముల్లు తిరుగుతున్నాయి. కనుక లోపల ఆత్మశక్తి వలనే సమస్త అంగములు కూడను పని చేస్తున్నాయి. దీనినే వేదము నీలతోయదమధ్యస్థా విద్యుల్లేఖేవ భాస్వరా... అని చెప్పుతుంది. విద్యుల్లేఖ అనేది మన Spinal column తొమ్మిది, పన్నెండు మధ్య లోపల విద్యుల్లేఖ వలె ఆ దివ్యజ్యోతి, జ్ఞానజ్యోతి వెలుగుతూ వుంటుండాది. అక్కడ ఆ విధముగా సంచరించటము చేతనే main Switch heart అనేది పని చేస్తుండాది. ఈ main Switch ఆన్‌లో వుండినంతవరకు అన్ని అంగములలో జ్యోతులు వెలుగుతున్నాయి. main Switch తీసేసి వేరే రూమ్‌లో Switch వేసినా లైటు రాదు మనకు. కనుక ఆ main Switch లోపల ఏముంటున్నాదో

అదే దివ్యమైన ఆత్మభావము పెట్టుకోవాలి. కనుక యీ దేహమనేది జడమే. అయితే పెరుగుతూ వుండదా? తరుగుతూ వుండదా అని కొంత మందికి సందేహము కలుగవచ్చు. పెరగటము తరగటములో చైతన్యమును గుర్తించటానికి వీలవుతుందా? ఇది చైతన్యమని చెప్పటానికి సాధ్యమవుతుందా? ఇల్లంతా తుడ్చి దినము యింత చెత్త తీసుకొని ఒక గుంతలో వేస్తాము. ఈ విధముగా ఒక నెల రోజులు వేసేటప్పటికి దిబ్బ పెరిగిపోతుంది. ఈ దిబ్బ పెరగటానికి చైతన్యమా కారణము. చెత్త వేస్తూ వేస్తూ వుంటే దిబ్బ పెరుగుతూ పెరుగుతూ పోయింది. అదే విధముగనే దేహమనే పెద్ద దిబ్బ దినము యిడ్లీ సాంబారు, ముద్దపప్పు అన్నీ వేస్తూ వేస్తూ వుంటే యీ దేహమనే దిబ్బ పెరుగుతున్నది. ఇదంతా చెత్త. మనము తినే తిండంతా చెత్తతో సమానము. ఈ చెత్తను వేయకుండా పది దినములు పెట్టండి అస్థిపంజరమై పోతుంది. తగ్గిపోతుంది. కాబట్టి యిది చైతన్యమని చెప్పటానికి వీలులేదు. దేహము జడమే.

ఈ విధముగా విచారణ చేస్తూ చూచినప్పుడు, మనము రాత్రి పండుకున్నాము. ఈ దేహము ఒక పరుపుపైన పడిపోయింది దిబ్బవలె. లేక ఒక మాంసము ముద్దవలె పడిపోయింది. కన్నులు, చెవులు, నోరు, ముక్కు, కాళ్లు, చేతులు అన్నీ వుంటున్నాయి అని అనుకుంటున్నాము. కాని రాత్రి స్వప్నము వచ్చింది. ఏమేమో మాట్లాడుతున్నాము ఎవరితోనో పోట్లాడుతున్నాము. ఎక్కడెక్కడో తిరుగుతున్నాము. ఎన్ని పనులో చేస్తున్నాము ఎవరెవరినో చూస్తున్నాము. ఏమేమో వింటున్నాము. అక్కడ వినేది ఎవరి చెవి. అక్కడ సంచరించిన పాదములు ఎవరివి? అక్కడ పనులు చేసిన చేతులు ఎవరివి? అక్కడ మాట్లాడిన నోరు ఎవరిది! అక్కడ చూచిన కన్నులు ఎవరివి? ఎవరు నీవు. అంతా మాయ. అన్నీ చూశావు. అన్నీ చేశావు. అన్నీ విన్నావు. అన్నీ చెప్పావు. కాని ఎంతవరకు యిది. మెలకువ వచ్చేటప్పటికి అంతా పోయింది. కలలో చూచినవన్నీ కూడను జగత్తులో మాయ. కలలో వుండినప్పుడు జాగ్రత్త శూన్యము. జాగ్రత్తలో కల లేదు. కాబట్టి కలలో అది మాయ. సుషుప్తిని మనము విచారించకుండా వుంటే యిది కేవలము ఒక ప్రతిబింబమే. అది కారణస్వరూపమైనటువంటిది. ఆ కారణము దేని యొక్క Reflection? మహాకారణము యొక్క Reflection. కనుక యీ మూడు స్థానములందు మనము విచారించినప్పుడు ఏదీ శాశ్వతము లేదు. జాగ్రత్తలో దేహము స్వప్నములో లేదు స్వప్నములో చూచిన మాయ సుషుప్తిలో కనుపించదు. కనుక యివన్నీ కేవలము అనిత్యము అశాశ్వతములనే సత్యాన్ని గుర్తించటమే వైరాగ్యమన్నారు. అన్నీ వదలిపెట్టమని కాదిక్కడ. ఈ దేహమును ఆధారముగా పెట్టుకొని నీవు చేయవలసిన కర్తవ్యాన్ని నిర్వర్తించు. ఈ విధమైన కర్తవ్యమును నిర్వర్తించే నిమిత్తమై కాయమును మనకు అనుగ్రహించాడు. అయితే యీ కాయము [illegible], పరోపకార సంబంధమైన పనులలో దీనిని ప్రవేశపెట్టాలి. దీని స్వార్థము స్వప్రయోజనము నిమిత్తమై దీనిని

ప్రవేశపెట్టకూడదు. తనకు తాను కూడను ఈ యింద్రియములను అధికముగా పెట్టరాని ఈ యింద్రియముల యొక్క శక్తి సామర్థ్యముల చేత పరులకు ఆనందము నందించే త్యాగ భావము కలిగి వుండాలి. శరీర మాద్యం ఖలు ధర్మసాధనమ్. ఈ శరీరమనేది ధర్మాచరణ నిమిత్తమై ఏర్పడినది.

ధర్మమనగా ఏమిటి? తెల్లవారి స్నానము చేయటం, సంధ్యావార్చటం, భోజనం చేయటం యివా ధర్మములు. ఇతరులు తనను యే విధముగా గౌరవించాలని ఆశిస్తున్నాడో ఆ విధముగా తాను యితరులను గౌరవించాలి అదే నిజమైన ధర్మము. ఇతరులు యే విధముగా వుంటుంటే మనము మంచిదని భావిస్తున్నామో మనము ఆ విధముగా మంచిగా వుండాలి. ఇతరులు యేమి చేస్తే దోషమని మనము నిందిస్తున్నామో ఆ దోషము మనము చేయకుండా వుండాలి. అదే నిజమైన ధర్మము. ధర్మమనగా మన హృదయానికి సమ్మతమైన మార్గమును మనము అనుసరించాలి. హృదయసాక్షిగా మనము అనుభవించాలి. ఇదే నిజమైన ధర్మమన్నారు. దీనినే Follow the master. నీ యొక్క హృదయాన్ని నీవు అనుసరించు. అప్పుడే నీకొక వైరాగ్యము ప్రాప్తిస్తుంది. Face the devil. దీని నిమిత్తమై Fight to the end. Finish the Game ఇదే నీ జీవిత లక్ష్యము. ఇలాంటి రహస్యాన్ని, యిలాంటి సత్య సూక్తులను లోకానికి అందించే నిమిత్తమై అనేక విధములుగా అవతార తత్వముల లోపల యిలాంటి చరిత్రలంతా పవిత్రమైన మార్గములో ప్రవేశపెడుతూ వచ్చారు. కనుకనే కబీరు కూడను చెప్పాడు. దుర్మార్గులకు నమస్కారము. సన్మార్గులకు నమస్కారము అన్నాడు. ఇరువురికి నమస్కారము చేయటములో అర్థమేమిటి వున్నాది. ఇరువురికి నమస్కారము చేయటములో అంతరార్థము వుంటున్నాది. దుష్టులు, దుర్మార్గులు అయిన వారికి నమస్కారము ఎందుకు చెయ్యాలి. అప్పుడు కబీరు చెప్పాడు. ఓ దుర్మార్గులారా! మీ యొక్క సంయోగము నాకు వుండకూడదు కనుక మీకు నమస్కారము. ఓ సన్మార్గులారా! మీతో వియోగము కలుగకూడదు కనుక మీకొక నమస్కారము. దుర్మార్గులతో అన్యోన్య సంబంధము నాకు వద్దు ఒక నమస్కారము దూరముగా వుండు అని వారికి నమస్కారము చేయటము. సన్మార్గులను అయ్యా నీవు పోవద్దు నన్ను వదలవద్దు నీ సంయోగము వదలి వుండలేను అని వానికొక నమస్కారము. ఈ విధముగా దుష్టులకు నమస్కారము చేసి దూరము పెట్టాలి. మంచి వానికొక నమస్కారము చేసి సర్వము అర్పితము గావించుకుంటే యిదే నీకు ధర్మము. అనగా దుష్ట భావములు, దుష్టశక్తులు, దుష్టాచారములు, దుష్టసంకల్పములు మనము దూరము పెట్టి సద్భావములు, సదాచారములు, సద్గుణములు, సత్సంపత్తిని మనము అభివృద్ధి గావించుకుంటూ పోవాలి. దీనినే వేదమునందు కూడను అందరు మనము భగవంతుని బిడ్డలము. అందరు కలిసి మెలిసి వుంటుండాలి. అందరు మన శక్తిని సద్వినియోగము చేసుకోవాలి. అని ప్రబోధిస్తూ వచ్చింది. అదే మనకు కాంతి అని చెప్పింది. సహనా వవతు, సహనౌ భునక్తు, సహవీర్యం కరవావహై యీ విధముగా మనము కలిసి మెలిసి వుండాము.

409118808

కలిసి మెలిసి తిరుగుదాం - కలిసి మెలిసి మెలగుదాం

తెలుసుకున్న సత్యమును తెలివితో బోధించుదాం

అందరూ కలిసి మెలిసి వుంటుండాలి. అంతేకాదు. కలిసి మెలిసి కలతలేక కలిసి మనము జీవిద్దాం అనింది. ఈ విధముగా వేదమునందు అనేకత్వములో వున్న ఏకత్వమును ఎంతనో బోధించినప్పటికిని యేదో స్వార్థము, స్వప్రయోజనము కలిగిన వారు యిప్పుడు కూడను భిన్నత్వాన్ని భావించుకుంటూ పోతున్నారు గాని ఏకత్వమునను యేమాత్రము కూడను మనసును ప్రవేశపెట్టుటం లేదు.

కనుక అనేకమైన పర్వదినములలో వుండిన విశిష్టమైన ధర్మాన్ని మనము గుర్తించాలి. దుష్టులను నశింప చేసి, దుష్టుల మరణముచేత లోకము ఒకవిధమైన శాంతి భద్రతలను చేకూర్చింది అనే వృద్ధత్వము తోనే ఆదుష్టులు మరణించిన దినము కూడను ఒక పండుగగా మనము అనుభవిస్తూ వచ్చాము నరకాసురుని సంహరించిన దినము నరకాసురుడనగా మనలో వున్న దుర్గుణములను యీనాడు మనము సంహారము చేయాలి. అందులో దాగి వున్న పదహారు వేలమంది గోపికలే సద్గుణములు. ఈ సద్గుణములనే గోపికలను మనము పరమాత్మునికి అంకితము చెయ్యాలి. అటువంటి రక్షణలోనే యీ తత్వము పోషింపచేసుకోవాలి. కనుక యీ విధమైన అంతరార్థమును ప్రబోధించిన దినము యీ నరక చతుర్దశి. ఈ ఆనందమును అనుభవింప చేసిన దినము కనుకనే జగత్తంతా దేదీప్యమానముగా వెలుతురులో నిండి వుండాలని వెలుగును మనము అభివృద్ధి చేస్తున్నాము. దీపములు ముట్టిస్తున్నాము. ఏనాడు కూడను వెలుగు చూడని వారు నరకాసురుని యొక్క చెరలో వుండిన స్త్రీలు యీ బంధ విమోచన జరిగిన తరువాత ఆనాడు వారు వెల్గునంతా చూస్తూ వచ్చారు. దీపమాల చూస్తూ వచ్చారు. దీపములు వెలిగిస్తూ వచ్చారు. అసురత్వమనే దుర్గుణము మనలో వుండినంత వరకు మనకు ఎప్పుడూ చీకటే. కనుక యీ దుష్ట శక్తులను మనము దూరము చెయ్యాలి. దుష్ట భావములు సంహరించాలి. దివ్యత్వాన్ని వెలిగించాలి. పవిత్రములతో నింపాలి. ఈ విధమైన అంతర్బోధ గావించిన దినమే యీ నరక చతుర్దశి. ఈ పవిత్రమైన స్థితి మనము పొందగలిగినామనే ఆనందోత్సవముల చేత యీ విధమైన మతాబులు అంతా కాలుస్తూ వచ్చారు. సంహరించిన శబ్దముక్రింద దుష్టశక్తులంతా కూడను ఘోరమైన టపాసులతో శబ్దమును పేల్చుకుంటూ వచ్చారు. ఆ శబ్దమును విన్నప్పుడంతా కూడను యీ పదహారువేల గోపికల లోపల ఆ దానవ శిరస్సు ఖండించినాడు కృష్ణుడు అనుకోటం, వారు ఆనందాన్ని అనుభవించటము. నరకాసురుని సంహారము మనకు గుర్తుగా భావించుకుంటూ వచ్చారు యీ శబ్దాన్నంతా.

ఏ విధమైన గుణములతో మనము జీవిస్తామో ఆ గుణముల యొక్క స్వభావము మనలను శిక్షిస్తుంది. స్త్రీలను హింసించినవాడు కనుకనే నరకాసురుడు స్త్రీ చేతనే హింసించబడ్డాడు. యద్భావం తద్భవతి. కనుకనే కృష్ణుడు యేమాత్రము ప్రవేశించలేదు

409118809

ప్రక్కనుండి ప్రోత్సహించాడు. అయితే దీనికి మరొక కథలు కూడా కొన్ని వుంటున్నాయి. నరకాసురుడు అగ్ని అస్త్రం వేయటం వలన కృష్ణుడు మూర్ఛిల్లినట్లు అతను మూర్ఛకు సహించుకోలేక సర్వ విద్యలు నేర్చుకున్న సత్యభామ తానే అతని వద్దనున్న ఆయుధము తీసుకొని యుద్ధమును ప్రారంభించినట్లు కొన్ని చరిత్రలు వ్రాస్తూ వచ్చారు. కానీ యిది సరియైనది కాదు. సత్యభామ ప్రకృతి స్వరూపిణి. కేవలము కృష్ణుని భార్యగా మనము భావించరాదు. ప్రకృతిలో సర్వ అన్యాయములకు సరిచేసిన మానవుని ప్రకృతి చేతనే హింసింప చేయాలి. ఇదే ప్రకృతి యొక్క ధర్మము Law of Nature ప్రకృతిని బాధపెట్టిన వాడు ప్రకృతిలోనే శిక్షింపబడాలి. ఈ విధముగా అనేక అంతరార్థముల చేత ఈ పర్వదినములను మనము అనుభవిస్తూ వస్తున్నాము. నవరాత్రులు కూడను అట్లనే. దుర్గ, లక్ష్మి, సరస్వతి ముగ్గురు యొక్క మూర్తులై పోయి చాముండిగా తాను స్వరూపము ధరించి మహిషాసురుని మర్దన గావించిన దినము. పాడ్యమి నుండి నవమి వరకు యుద్ధము చేయుటము వలనే ఈ తొమ్మిది దినములు ఒక పూజగా మనము చేస్తూ వచ్చాము. అనగా దుర్గ, లక్ష్మి, సరస్వతులు ప్రత్యేకమైన స్త్రీ రూపములు కాదు. ఇచ్ఛాశక్తి క్రియాశక్తి, జ్ఞాన శక్తి. ఇచ్ఛాశక్తి దుర్గ. క్రియాశక్తి లక్ష్మి. జ్ఞానశక్తి సరస్వతి. ఈ మూడింటి ఏకత్వము చేతనే సమ్మిళితమైన స్వరూపమే మహాశక్తిగా మారింది. ఈ మహాశక్తి చేతనే మహిషాసురుడు హతమై పోయాడు. అందు చేత నవమి రోజు ఆయుధ పూజ అని, యింక ఆయుధములతో పని లేదని చెప్పి ఆయుధములకు విశ్రాంతి యిస్తూ వచ్చారు. రాక్షస నాయకుడు అతను. ఇంద్రాది దేవతలను జయించాడు. కాని అట్టి క్రూరుని సంహరించిన దినము కనుక యీ దినము ఆయుధపూజగా మనము చేసుకుంటూ వచ్చాము

ఇట్లా ఒక్కొక్క పండుగకు అంతరార్థములు వుండటము చేతనే భారతీయులు ఆరాధనా రూపకముగా, ఒక భగవత్ స్వరూపకముగా భావిస్తూ వచ్చారే గాని కేవలము ఒక మూర్ఖత్వముగా గాని, అమాయకత్వముగా గాని, కేవలము వేడుకగా గాని చేసుకుంటూ వచ్చే పూజలు కావు యివి. ఇవన్నీ మూఢనమ్మకములని చెప్పి బోధించేవారు లేక పోలేదు. అంతరార్థములు తెలియక పోవటం చేతనే వారు ఆ రీతిగా విశ్వసిస్తున్నారు. ఒక్కొక్క పండుగ దినము అంతరార్థము ప్రబోధించే మహనీయులు లేకపోటం కూడా దీనికి మూలకారణము. కాని ఏ ఒక్కటి కూడా అర్థము లేకుండా భారతీయులు అనుసరించిన వారు కాదు. ప్రతి దానికి అంతర్ బహిరర్థములు వుంటున్నాయి. అది ప్రాచీన కాలము నుండి మహర్షుల తత్వము చేతనే యిది అభివృద్ధి అవుతూ వస్తున్నాయి. కనుక మన పర్వదినములకు సరైన అర్థములు గుర్తించి వర్తించటానికి ప్రయత్నించాలని ఆశిస్తున్నాను. నరకాసుర సంహారమనగా ఏమిటి? మన యందున్న అసురత్వమును సంహారము చేయటమే. కనుక యీనాడు మనము నరకాసుర సంహారము చేసుకోటంలో వున్న అంతరార్థమేమనగా మనలో వున్న యీ దుర్గుణములను, అసురత్వమును, దురాలోచనలు, దుశ్చింతలు

409118810

దుశ్చర్యలను దూరము చేసుకొని సద్భావములు, సదాలోచనలు, సచ్చింతనలు అభివృద్ధి పరచుకోవాలని ఆశిస్తూ ఆశీర్వదిస్తూ నాప్రసంగాన్ని విరమిస్తున్నాను.